నిషేధిత మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ


మాట్లాడుతున్న డీఎస్పీ

గుంటూరు రూరల్: నిషేధిత మత్తు పదార్థాలు, డ్రగ్స్, మద్యం వల్ల జీవితాలు నాశనమవుతాయని సౌత్ జోన్ డీఎస్పీ జి. భానోదయ తెలిపారు. బుడంపాడులోని జీవీఆర్ అండ్ ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం ఫ్యూషన్ ఫిస్టా- 2025 పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజంలో డ్రగ్స్ నివారణ, మద్యపాన నిషేధం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదువుతోపాటు అన్నిరంగాల్లో నైపుణ్యతను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కరిమూన్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్చుకోవాలని తెలిపారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల డైరెక్టర్ రవి భువనేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ పి. భాస్కర్‌నాయుడు, కళాశాల డీన్ బి. వరప్రసాద్, ఫెస్ట్ కన్వీనర్ సీహెచ్. పాపారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలకు అండగా న్యాయ వ్యవస్థ

- న్యాయమూర్తి ఏకా పవన్‌కుమార్
- పోక్సో చట్టంపై అవగాహన అవసరం


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి పవన్‌కుమార్

పొన్నూరు: బాలికలతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు తరువాత పోలీసులకు తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏకా పవన్ కుమార్ తెలిపారు. మండలంలోని మామిళ్లపల్లిలో శుక్రవారం బాలికల భద్రతపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ 2012లో వచ్చిన పోక్సో చట్టంపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ చట్టం కింద కేసు నమోదైతే తీర్పులు వెంటనే వస్తాయని, శిక్షలు కూడా కఠినంగా ఉంటాయని తెలిపారు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ ఎప్పుడూ బాలబాలికలకు అండగా ఉంటుందని చెప్పారు. 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు చట్టాలపై అవగాహన కల్పించడమే ఈ సదస్సును లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. చిన్నతనం నుంచే పిల్లలు తల్లిదండ్రులు, పెద్దలతో గౌరవంతో మెలగాలని, నైతిక విలువలు తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ జల్లి రమేష్‌బాబు, పంచాయతీ సెక్రటరీ జి. రామకృష్ణ, సర్పంచి షేక్ బుడే, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లైటింగ్, డెకరేషన్‌లకు వేలం పాటలు నిర్వహించాలి

పెదకాకాని: వెనిగండ్లలోని మైత్రీ కల్యాణ మండపంలో లైటింగ్, డెకరేషన్‌కు వేలం పాటలు నిర్వహించి గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచాలని ఎంపీడీఓ ఆర్. శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కె. శ్రీనివాసరావులను ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర పబ్లిక్ అవేర్‌నెస్ కమిటీ అధ్యక్షుడు కొండమడుగుల రామిరెడ్డి కోరారు. ఈ మేరకు వారికి వినతిపత్రం అందజేశారు.

రేపు పాస్టర్ ప్రవీణ్ శాంతి రుధిర యాత్ర



నెహ్రూ నగర్: పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతికి నిరసనగా ఈనెల 30వ తేదీన గుంటూరులో శాంతి రుధిర యాత్ర నిర్వహించనున్నట్లు క్రైస్తవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల రాజు తెలిపారు. శుక్రవారం మిర్చి యార్డు రోడ్‌లో క్రైస్తవ, మైనారిటీ సంఘ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయన మరణం పై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పాస్టర్ జోసఫ్, రాంబాబు, విల్సన్, విద్యాసాగర్, మధు ప్రేమ్ జ్యోతి బాబు, నల్లపు నీలాంబరం, రవి కిరణ్, లీల పాల్గొన్నారు.

అల్లా కృప ప్రతి ఒక్కరిపై ఉండాలి



గుంటూరు రూరల్: ప్రతి ముస్లింపై అల్లా కృప ఎల్లప్పుడూ ఉండాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. పెదనందిపాడులోని జుమ్మా మసీదులో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఖాసింపీరా ఆధ్వర్యంలో మత పెద్దలతో జరిగిన ఇఫ్తార్ విందులో బలసాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా కఠిన దీక్షతో ఉపవాసం చేసి, అల్లాను ప్రార్థించే ప్రతి ఒక్క ముస్లింకు ఆయన ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా కృపతో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాని ఆకాంక్షించారు. ఇఫ్తార్ ఉపవాస దీక్ష విరమణలో భాగంగా మత పెద్దలకు ఖర్జూరాలు, పండ్లు తినిపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి పద్మారావు, ఉప సర్పంచ్ దివి రాంబాబు, అబ్దుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం



గుంటూరు మెడికల్: నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతి రావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో పార్టీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, నేరెళ్ల మాధవరావు, చంద్రశేఖర్, ఈదర శ్రీనివాస రెడ్డి, వై.వి.సుబ్బారావు, చరకా కుమార్ గౌడ్, సురేష్ జైన్, బజరంగ్ రామకృష్ణ, మందడపు సురేష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

అనుమతి లేకుండా ఎగ్జిబిషన్ ఏర్పాటు పనులు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని స్తంభాల గరువు దగ్గరున్న చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో అనుమతులు తీసుకోకుండా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు నగర కమిషనర్‌కు ఈ నెల 16వ తేదీన ఫిర్యాదు చేశారు. కమిషనర్ సదరు ప్రాంతాన్ని పరిశీలించి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారు. అయినప్పటికీ ప్రాంగణంలో లారీలకు లారీలకు సామానులు దింపుతుండటంపై స్థానికులు మండిపడుతున్నారు. అధికార పార్టీ అండదండలతో ఎలాగైనా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు సామాన్లు దింపుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇక్కడ ఎగ్జిబిషన్ పెడితే చుట్టుపక్కల ఉండే వారికి కాలుష్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు, అపరిశుభ్ర వాతావరణంతో రోగాల బారిన పడే అవకాశం ఉందని వాపోతున్నారు.

రేపు సాహితీ వసంతోత్సవం


పోస్టర్లను విడుదల చేస్తున్న లక్ష్మీనారాయణ, రాము, రామచంద్రరాజు

నగరంపాలెం: ఉగాది సందర్భంగా ఈనెల 30న సాహితీ వసంతోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో వసంతోత్సవ గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాహితీ వసంతోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగీత విద్వన్మణి ఆర్.సూర్యలక్ష్మి శిష్య బృందంతో విష్ణుసహస్రనామ పారాయణ, గుదిమెళ్ల శ్రీ కూర్మనాథస్వామి పంచాంగ శ్రవణం ఉంటుందని చెప్పారు. సమాఖ్య కార్యదర్శి ఆర్.రాము, టీఎంటీ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు మాట్లాడుతూ సాయంత్రం ఆరున్నరకు జరిగే సాహితీ సమ్మేళనంలో సుప్రసిద్ధ సినీ గేయ, గజల్ రచయిత రసరాజు, ప్రసిద్ధ రచయిత, కవి యాకూబు, సుప్రసిద్ధ సినీ నటులు కేదార్ శంకర్, హాస్య రచయిత డాక్టర్ పీవీ రామ్ కుమార్, సంభాషణ రచయిత కె.కృష్ణవేణి, అష్టావధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్ పాల్గొంటారని చెప్పారు.

తూతూమంత్రంగా రుణాలకు అర్జీల స్వీకరణ



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరులో వివిధ కార్పొరేషన్ల రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల నుంచి శుక్రవారం అర్జీలను ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు స్వీకరించారు. కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. కేవలం అర్జీలను స్వీకరించి, వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తుదారులను పంపించి వేశారు. ఇంటర్వ్యూలు చేయకుండా, అర్హతలు, అనుభవాలను అడగకుండా పంపించి వేయడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించే సమయంలోనైనా రుణం అవసరం, చేసే వ్యాపారం, యూనిట్‌కు ఎంత ఖర్చవుతుంది ? తదితర అంశాలను అడగక పోవడంతో నిరాశ చెందుతున్నారు. మండలం మొత్తం మీద 58 యూనిట్లకు 364 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అధికారులే ఈ విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తుంటే ఇక రుణాలు వచ్చినట్టేనని దరఖాస్తుదారులు చర్చించుకున్నారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


వేడుకల్లో విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్య మనిషిలో జ్ఞానాన్ని పెంపొందించి, మార్గదర్శకంగా నిలిచే సాధనమని ప్రాడిజి విద్యాలయం, సీనియర్ మాంటిసోరి విద్యా సంస్థల డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు తెలిపారు. బుడంపాడులోని పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ చిన్నారులు విద్యను అభ్యసించే తరుణంలో, ఒక దశ నుంచి మరొక దశకు మారేప్పుడు నైపుణ్యాలను ప్రశంసిస్తూ వారిలో సృజనాత్మకతను పెంపొందించాలని తెలిపారు. విజ్ఞాన వికాసాన్ని మెరుగు పరిచే నాలుగు అంశాలైన జ్ఞాన, నైతిక, సామాజిక, లిఖిత నైపుణ్యాల గురించి వివరించారు. కరస్పాండెంట్ సూర్యకుమారి ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులు పాల్గొన్న వివిధ రకాల పోటీలు, యాక్టివిటీలను వివరించారు. ప్రిన్సిపల్ వై. రధిని చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. విద్యార్థులు తల్లిదండ్రులతో చేసిన ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సుజిత పాల్గొన్నారు.

సెలవు రోజుల్లోనూ పని చేయనున్న ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు

నెహ్రూ నగర్: ఆస్తి పన్ను చెల్లించటానికి మూడు రోజులే గడువు ఉన్న నేపథ్యంలో ఈ నెల 30,31 తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగ సెలవు రోజులైనప్పటికీ జీఎంసీ ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు పని చేస్తాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 50 శాతం రాయితీని వినియోగించుకొని పన్ను చెల్లించడానికి మూడు రోజులే గడువు ఉన్నందున, సెలవు రోజుల్లోనూ పన్ను చెల్లించడానికి వచ్చే వారికి వీలుగా ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కౌంటర్ల పెంపు చేయడంతో పాటు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.
వడ్డీ రాయితీతో పన్ను చెల్లించడానికి చివరి అవకాశం కనుక ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జీఎంసీ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లోని కౌంటర్లలో పన్ను చెల్లించి, నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. శుక్రవారం రూ.2.50 కోట్లు పన్ను వసూలైనట్లు వివరించారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ రూ.1534.27 కోట్ల ఆమోదం కోసం శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు కౌన్సిల్ సెక్రటరీ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కౌన్సిల్ సమావేశం మందిరంలో 11 గంటలకు తాత్కాలిక మేయర్ షేక్ సజీల అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా ఇఫ్తార్ వేడుకలు


విందులో పాల్గొన్న లావు రత్తయ్య, ముస్లింలు

చేబ్రోలు: దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండుగని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శుక్రవారం ఇఫ్తార్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, వడ్లమూడి గ్రామ ముస్లిం సోదరులతో కలిసి విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ రత్తయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ వెనుక మానసిక, శారీరక వికాసం వంటి ఎన్నో విశేషాలు ఉన్నాయని చెప్పారు. నెలవంక దర్శనంతో మొదలై, మళ్లీ దర్శనంతోనే ముగుస్తుందని తెలిపారు. ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యమున్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు, కఠిన ఉపవాస దీక్షలు, దాన ధర్మాలు, ఆధ్యాత్మిక సందేశాలతో సాగుతుందని వివరించారు. మహ్మద్ ప్రవక్త ''లా ఇల్లాహ'' అనే సూత్రం ప్రకారం మానవులను కష్టాల నుంచి కాపాడేందుకు ఈ మాసాన్ని సృష్టించినట్లు చరిత్ర చెబుతోందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్, డీన్లు, విద్యార్థులు, వడ్లమూడి గ్రామ ముస్లింలు పాల్గొన్నారు.

క్రెడిట్ క్యాంపునకు అనూహ్య స్పందన

328 మంది దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కార్పొరేషన్ ప్రతినిధులు, బ్యాంకర్లు, ఎంపీడీవో ఉమాదేవి

చేబ్రోలు: కార్పొరేషన్ రుణాల మంజూరు నిమిత్తం చేబ్రోలులో శుక్రవారం నిర్వహించిన క్రెడిట్ క్యాంపునకు అనూహ్య స్పందన లభించినట్లు అధికారులు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ, కాపులతో పాటు జనరిక్ ఫార్మసీల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా బ్యాంకు రుణాలు 50 శాతం సబ్సిడీతో యువతకు మంజూరు నిమిత్తం క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో 371మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో ఏ. ఉమాదేవి తెలిపారు. ఇందులో 328మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోకుండా నేరుగా ధ్రువీకరణ పత్రాలతో హాజరయ్యారు. వీరికి నిరాశే ఎదురైంది. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల పరిధిలోని బ్యాంక్ మేనేజర్లు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం


కార్యక్రమంలో మాట్లాడుతున్న రామారావు

పొన్నూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ సంయుక్తంగా ఢిల్లీలో నిర్వహిస్తున్న ధర్నాకు సంఘీభావంగా శుక్రవారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఏడుకొండలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు, ప్రచారంలో తాడేపల్లిగూడెం బహిరంగ సభలో పవన్ కల్యాణ్ తాము అధికారంలోకి వస్తే వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కోటి రూపాయలు విరాళంగా ప్రకటించారని, పెండింగ్‌లో ఉన్న క్లెయిములను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారని తెలిపారు. నేడు అధికారంలోకి వచ్చి ఉప ముఖ్యమంత్రి పదవి తీసుకున్న పవన్ కల్యాణ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మిక్కిలి జాన్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గుమ్మడి రోశయ్య, నాయకులు శివాజీ, బ్రహ్మం, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సూరిబాబు పాల్గొన్నారు.

రంజాన్ ఉపవాస ఫలం.. ఖజూర్

- ఖర్జూరం అమృతాహారం
- ఔషధ గుణాలు అధికమే
- తిన్న వెంటనే తక్షణ శక్తి


కోబాల్డ్‌పేట మసీదు వద్ద ఉపవాస ఫలాలను విక్రయిస్తున్న వ్యాపారులు

లక్ష్మీపురం: రంజాన్ మాసం ప్రారంభమై 27 రోజులు పూర్తయ్యాయి. ఉపవాస దీక్షను విరమించేందుకు(ఇఫ్తార్)లో ముందుగా ఖర్జూరాలను తీసుకోవడం ఆనవాయితీ. ప్రతి మసీదు, మార్కెట్‌లో వాడవాడలా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. భారత్‌లో పండే ఖర్జూరాలతో పాటు సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, జోర్డాన్ తదితర దేశాలకు చెందిన దాదాపు 50 రకాలు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వీటిలో అజ్‌వా, సగాయి, మెడ్‌జూల్, అల్ బెనా, ఫిట్, క్రౌన్, తైబ, కిమియ, హస్నా, కౌసర్ ఫర్ద్, పెయింట్ ఖజూర్ రకాలు ముఖ్యమైనవి. రంజాన్ మాసంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షను పాటించడం వల్ల శరీరంలో శక్తితో పాటు రోగనిరోధక శక్తి కూడా తగ్గుతుంది. ఆ సమయంలో శరీరంపై వ్యాధులు దాడి చేయకుండా ఉపవాస దీక్ష విరమణ సమయంలో ఖర్జూరాన్ని తీసుకోవాల్సిందిగా చెబుతారు. వివిధ రకాల ఖజూర్‌లు జిల్లాలో అందుబాటులోకి వచ్చాయి. వీటిలో కిలో రూ.100 పలికే పెయింట్ ఖజూర్ నుంచి కిలో రూ.2700 వరకు పలికే అజ్‌వా ఖజూర్ వరకు అనేక రకాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి.

వారెవ్వా అజ్‌వా...

ఖర్జూరలో చాలా ఖరీదైన రకం అజ్‌వా. సౌదీ అరేబియాలో పండే ఈ రకం ఖజూర్ ప్రపంచంలో కెల్లా అత్యంత తియ్యనైన పండుగా చెబుతారు. నల్లటి రంగులో ఉండే అజ్‌వా ఖజూర్‌లోని విత్తనాలను తొలిగించి, వీటిలో పూర్తిగా బాదం, పిస్తా వంటి డ్రైఫ్రూట్స్‌ను స్టఫ్ చేసి వాటిని తేనెలో ముంచి, అసలైన కుంకుమ పువ్వును వేస్తారు. ఎంతో పౌష్టిక విలువలను కలిగిన అజ్‌వా ధరలో కూడా చాలా ఘనమైనదే. కిలో ప్యాకెట్ ధర రూ.4 వేల నుంచి అందుబాటులో ఉంటుంది.

నోరూరించే సగాయి


అజ్‌వా తరువాత తియ్యదనంలో మేటిగా చెప్పబడే ఖజూర్ రకం సగాయి. దుబాయ్‌లో పండే సగాయి కూడా ప్రపంచ మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న ఖజూర్. వీటిలో డ్రైఫ్రూట్స్ స్టఫ్ చేసి కుంకుమ పువ్వుతో కలిపి అమ్ముతారు. సగాయి కిలో సుమారు రూ.5 వేల వరకు ఉంది.

ఎన్జీరంగా వర్సిటీలో పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతి


పుట్టపర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వీసీ శారద జయలక్ష్మీదేవి తదితరులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతి సందర్భంగా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి పుష్పాంజలి ఘటించారు. నగర శివారుల్లోని లాంఫాంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు గొప్ప కవి అని కొనియాడారు. ఆయన శివతాండవం సృష్టికర్త అని, బహు భాషా కోవిదుడని, అనర్గళంగా ఎనిమిది భాషల్లో మాట్లాడగలుగుతూ 14 భాషల్లో పట్టు కలిగిన వ్యక్తి అని తెలిపారు. ఆయన తెలుగులో అనేక రచనలతోపాటు ఆంగ్ల భాషలోనూ చేశారన్నారు. అటువంటి మహానుభావులను గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు పాల్గొన్నారు.

తొమ్మిది మందికి ఉగాది పురస్కారాలు ప్రదానం


ఉగాది పురస్కారాలతో సత్కారం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి (హైదరాబాద్), ఆరాధన ఆర్ట్స్ అకాడమీ(గుంటూరు), నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తోన్న ఉగాది పురస్కార ప్రదానోత్సవం శుక్రవారం రెండో రోజు కొనసాగింది. వెలువోలు నాగరాజ్యలక్ష్మి(సాహిత్యం), బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి(న్యాయవాది), మేకల మోహనరావు(విద్య), డాక్టర్ బండ్ల రామ్ చంద్(వైద్యం), బొర్రా నరసయ్య(నాటక రంగం), వడ్డమాను రంగమణి(కూచిపూడి), రామరాజు ప్రేమ్‌కుమార్(సంగీతం), బండారు నాగమణి, చెరుకూరి సాంబశివరావు(కళ రంగం)లను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి, నాలుగో జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు, ఏపీ సెక్రటేరియట్ లా డిపార్ట్‌మెంట్ అదనపు కార్యదర్శి డాక్టర్ లంకా లక్ష్మీనారాయణ, అజో విభో ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ, ఆలయ కమిటీధ్యక్షులు సీహెచ్ స్థానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వర రావు ప్రసంగించారు. అనంతరం శ్రీకృష్ణా ఆర్ట్స్ థియేటర్(ఢిల్లీ) ఆధ్వర్యంలో బర్రె సత్యనారాయణ రచించి, ఢిల్లీ చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన అనశ్వరం నాటిక సందేశాత్మకంగా సాగింది. ఆలాపన వెంకటేశ్వరరావు ఆలపించిన సినీ, భక్తిగీతాలు అలరించాయి. కళా విపంచి అధ్యక్షులు బొప్పన్న నరసింహారావు, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు డి.తిరుమలేశ్వరరావు, నటరత్న ఎన్టీఆర్ పరిషత్ నిర్వాహకులు కాట్రగడ్డ రామకృష్ణ పాల్గొనగా, ఎ.వి.కె.సుజాత వ్యాఖ్యతగా వ్యవహరించారు. కార్యక్రమాలను జి.మల్లికార్జునరావు, ఎ.విశ్వనాథ బాబు, సాంబశివరావు, సయ్యద్ జానీబాషా, జీవీ శంకర్, భంగి శివశంకర శాస్త్రి, నడింపల్లి వెంకటేశ్వరరావు, డి.తిరుమలేశ్వరరావు పర్యవేక్షించారు.

సీనియారిటీ జాబితాల్లో సమస్యలు పరిష్కరించాలి

డీఈఓకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాశాఖ విడుదల చేసిన అన్ని కేడర్లకు సంబంధించిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాల్లో నెలకొన్న అసంబద్ధాలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జాబితాల్లోని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకకు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు మాట్లాడుతూ డీఎస్సీల వారీగా విడుదల చేసిన మెరిట్ సీనియారిటీ జాబితాల్లో మునిసిపల్, కార్పొరేషన్ మేనేజ్‌మెంట్లలో నెలకొన్న అసంబద్ధాలను సరిచేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్స్‌తో పాటు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాలో వరస క్రమం లోపించిందని, ఫీడర్ కేడర్ ఎస్జీటీల సెలక్షన్ జాబితాలోనూ లోపాలున్నాయని తెలిపారు. డీఎస్సీ-2008 ద్వారా పెద్ద సంఖ్యలో నియమితులైన ఎస్జీటీలతో పాటు మిగిలిన వారు ఉద్యోగ హామీపత్రాలు పొందారని పేర్కొన్నారు. అయితే విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు బదులుగా, హామీ పత్రాలు పొందిన అభ్యర్థులను మెరిట్ జాబితాలో ముందు వరసలో ఉంచడం అన్యాయమని ఆరోపించారు.
2008లో డీఎస్సీ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా విధుల్లో చేరిన వారందరికీ కామన్ జాయినింగ్ డేట్ ఇచ్చి సీనియర్లకు న్యాయం చేయాలని కోరారు. ప్రస్తుతం విద్యాశాఖ మెరిట్ సెలక్షన్ లిస్టులు విడుదల చేసిందని, వాటి స్థానంలో మెరిట్ కమ్ రోస్టర్ సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని విన్నవించారు. అభ్యంతరాలను సమర్పించే గడువు పొడిగించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్ఎస్ఎన్ మూర్తి, కె.రమేష్, జి.దాస్, చక్కా వెంకటేశ్వర్లు, కిషోర్‌షా ఉన్నారు.